క్లుప్తంగా

కవితా సంపుటాల ఆవిష్కరణ



కవితా సంపుటాలను తన తల్లికి అంకితమిస్తున్న ఆకొండి వెంకటలక్ష్మి

పిఠాపురం: శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం, పురుహూతిక కల్చరల్ అసోసియేషన్, మన ఊరు–మన బాధ్యత సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీ సూర్యారాయ విద్యానంద గ్రంథాలయం పీఠికాపుర కళావేదికలో గురువారం కవితా సంపుటాలను ఆవిష్కరించారు. కవి ఆకొండి వెంకటలక్ష్మి రచించిన మూడు కవితా సంపుటాలను ఆమె తన తల్లికి అంకితం ఇచ్చి ఆవిష్కరించారు. కవన సవ్వడులు, వ్యాసమంజరి, భావనా కుసుమాలు అనే పుస్తకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనేక మంది కవులు పాల్గొని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కేవీఎస్ఎస్ ప్రసాద్, వెన్నపు చక్రధరరావు, కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్, తటవర్తి సుబ్బారావు, రేగళ్ల నీలకంఠ శర్మ, అకొండి శివరామ కృష్ణ, ఆకొండి వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

11న ముత్యాలమ్మతల్లి జాతర



ముత్యాలమ్మతల్లి

కొత్తపల్లి: స్థానిక ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. అమ్మవారి గరగలను గ్రామంలో ఊరేగిస్తున్నామన్నారు. సోమవారం తీర్థాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జాతర, ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి రంగులువేసి, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు.

కొత్తపల్లి మండల అధికారులు

తహసీల్దార్	91542 47464
ఎంపీడీఓ	94401 13090
ఇంజినీర్	99890 78030
ఎలక్ట్రికల్ ఏఈ	94408 12642
హౌసింగ్ ఏఈ	70939 30455
ఈఓసీఆర్డీ	99489 27333
ఉపాధి హామీ పథకం ఏపీఓ	83744 46378
డ్వాక్రా ఏపీఎం	89788 81622
ఎస్సై	94409 00752
సీఐ పిఠాపురం	94407 96523
వ్యవసాయ శాఖ ఏఓ	83310 56594
కొత్తపల్లి పీహెచ్సీ డాక్టర్	99890 69546
నాగులపల్లి పీహెచ్సీ డాక్టర్	98497 28671
కొమరగిరి పీహెచ్సీ డాక్టర్	92466 90633
ఆర్డబ్ల్యూఎస్ ఏఈ	89858 28380
ఎంఈఓ	92467 34465
ఐసీడీఎస్ సీడీపీఓ	94408 14692
ఇరిగేషన్ జేఈ	83310 75078

ఇంటింటికీ ఓ గొళ్లెం!

- ఇళ్ల మంజూరులో అధికారుల మెలికలు
- అప్పుచేసి వాటా చెల్లిస్తున్న లబ్ధిదారులు
- ఎనిమిదేళ్లు అవుతున్నా అతీగతీ లేని వైనం
- టిడ్కో ఇళ్ల మంజూరులో అవస్థలెన్నో



సామర్లకోట జగ్గమ్మగారిపేటలోని టిడ్కో ఇళ్ల సముదాయం

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందక గగ్గోలు పెడుతున్నారు. ఇళ్ల మంజూరులో దో ఒక మెలిక పెడుతూ లబ్ధిదారులను అవస్థలపాలుజేస్తున్నారు. స్థానిక జగ్గమ్మగారిపేట, ఉప్పువారి సత్రం వద్ద టిడ్కో ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులను గుర్తించి 2017లో వారి వాటా సేకరించారు. ఈ మేరకు మున్సిపాలిటీ పరిధిలో 1056 ఇళ్లు నిర్మించారు. కానీ ఇప్పటి వరకు అనేక మందికి ఇళ్లు కేటాయించలేదు. రూ.500 కేటగిరిలో 300 చదరపు అడుగులు, రూ.50 వేల కేటగిరిలో 365 చదరపు అడుగులు, రూ.లక్ష కేటగిరిలో 430 చదరపు అడుగుల్లో ఇళ్ల నిర్మాణానికి నిర్ణయించారు.

దీనిలో భాగంగా జగ్గమ్మగారి పేటలో 416 ఇళ్లు, ఉప్పువారి సత్రం వద్ద 640 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. దీనిలో భాగంగా జగ్గమ్మగారిపేటలో రూ.500 కేటగిరిలో 96, రూ.50 వేల కేటగిరిలో 32, రూ.లక్ష కేటగిరిలో 288 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. అలాగే ఉప్పు వారి సత్రం వద్ద రూ.500 కేటగిరిలో 64, రూ.500 వేల కేటగిరిలో 256, రూ.లక్ష కేటగిరిలో 320 ఇళ్లు పూర్తి చేశారు. ఇళ్ల కేటాయింపులో భాగంగా బ్యాంకు రుణంగా రూ.మూడు లక్షలు చెల్లించాల్సి ఉంది.

ఈ మేరకు మెప్మా అధికారులు లబ్ధిదారుల పేరున బ్యాంకుల నుంచి రుణాలు అందజేసే ఏర్పాటు చేశారు. రుణాలు మంజూరైన లబ్ధిదారులకు కూడా మూడేళ్లు గడుస్తున్నా ఇళ్లు కేటాయించలేదు. దాంతో లబ్ధిదారులు ఆందోళనకు గురి అవుతున్నారు.



సామర్లకోట ఉప్పువారి సత్రం వద్ద టిడ్కో ఇళ్ల సముదాయం

అప్పులపై వడ్డీలు.. భరించలేని అద్దెలు..

టిడ్కో ఇళ్ల కోసం దరఖాస్తు చేసిన వారిలో అనేక మంది అద్దె ఇళ్లలో నివసిస్తున్నారు. మరి కొందరు మంది ఉమ్మడి కుటుంబంలో సర్దుకుంటున్నారు. టిడ్కో ఇళ్లు వస్తే అద్దెల బాధ తగ్గుతుందని, ఇరుకు ఇళ్ల నుంచి మోక్షం లభిస్తుందని అప్పులు చేసి రూ.50 వేలు, రూ.లక్ష చెల్లించారు. దీనిపై 8 ఏళ్లుగా వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. అలాగే బ్యాంకు రుణాలు మంజూరైన లబ్ధిదారులకు బ్యాంకులు వాయిదాలు చెల్లించాలని డిమాండ్ నోటీసులు రావడంతో వారు లబోదిబోమంటున్నారు. బ్యాంకు రుణం పొందిన తరువాత లబ్ధిదారుల ఇళ్లను వారి పేరున రిజిస్టర్ చేసి ఇవ్వాల్సి ఉంది. అయితే అది కూడా పూర్తిగా జరుగలేదు. వాటా ధనం చెల్లించిన సమయంలో 50 ఏళ్లు ఉండగా వారి వయసు ప్రస్తుతం 60 ఏళ్లు ఉండడంతో వారిని అనర్హులుగా ప్రకటిస్తున్నారు. దాంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాకులు చెప్తున్నారు



బ్యాంకు నుంచి రుణం ఇవ్వడానికి అర్హత లేదనే సాకులు చెప్పి మెప్మా సిబ్బంది తప్పించు కొంటున్నారు. తనకు గాని తన భర్తకు గాని బ్యాంకులలో అప్పులు లేవు. సిబిల్ స్కోర్ తక్కువ ఉండడం వల్ల బ్యాంకు రుణం ఇచ్చే అవకాశం లేదని నోటీసు ఇచ్చారు. సుమారు 8 ఏళ్ల క్రితం అప్పు చేసి రూ.50 వేలు వాటా ధనం చెల్లించాం. అయితే బ్యాంకు రుణం రాలేదనే సాకు చెప్పి తన ఇల్లు రద్దు చేసే ప్రయత్నంలో నోటీసు ఇచ్చారు. ఒకేసారి రూ.మూడు లక్షలు చెల్లిస్తే ప్లాటు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని చెప్తున్నారు. అంత డబ్బు ఉంటే టిడ్కో ప్లాట్‌కు ఎందుకు దరఖాస్తు చేస్తాం.

– కర్రి జ్యోతి,
టిడ్కో లబ్ధిదారు, సామర్లకోట


10 రోజుల్లో స్వాధీనం చేస్తాం



టిడ్కో ఇళ్ల సముదాయంలో అనేక ప్లాట్లు పాడైపోయాయి. దాంతో వాటిని మరమ్మతులు చేయాల్సి ఉంది. దీనికి ఇటీవల నిధులు మంజూరు కావడంతో మరమ్మతులు పూర్తి చేసి బ్యాంకు లోను, రిజిస్ట్రేషన్ పూర్తయిన వారికి ప్లాటు స్వాధీనం చేస్తాం. ప్లాట్లు మంజూరైన వారిలో కొందరికి బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదు. రుణాలు తీసుకున్న వారు వాయిదాలు చెల్లించక పోవడంతో బ్యాంకులు ముందుకు రావడం లేదు. వయసు ఎక్కువ ఉన్న వారి వారసులు ఉంటే వారి పేరు బ్యాంకు లోన్‌పై రిజిస్ట్రేషన్ జరుగు తుంది.

– హుస్సేన్,
మెప్మా సీఎంఎం, సామర్లకోట

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



మాండవ్యనారాయణస్వామి ఆలయంలోని మహాలక్ష్మి అమ్మవారు

సామర్లకోట: స్థానిక గోదావరి నదీ తీరంలో వేంచేసి ఉన్న మాండవ్యనారాయణస్వామి ఆలయంలోని మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఏకాదశి అమ్మవారి ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలోని శ్రీ, భూ సమేత మాండవ్య నారాయణ స్వామికి పంచామృతాభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గరుడ వాహనంపై ఊరేగించారు. ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా స్టేషన్ సెంటర్, గోలివారి వీధి, గాంధీచౌక్, చిన్న వీధి, పెద్దవీధి, యార్లగడ్డవారి వీధి, నీలమ్మచెరువు, మఠంసెంటర్, అయోధ్యరామపురం, కొత్తూరు మీదుగా గ్రామోత్సవం ఆలయానికి చేరింది. తమ ఇళ్ల వద్దకు వచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

మీడియా స్వేచ్ఛను పరిరక్షించాలి

- సాక్షి ఎడిటర్ కార్యాలయంపై దాడికి జర్నలిస్టుల నిరసన
- ఆర్డీఓ శ్రీరమణికి వినతిపత్రం అందజేత



పెద్దాపురంలో ఆర్డీఓ శ్రీరమణికి వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

పెద్దాపురం: మీడియాపై దాడులు ఆపాలని, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలని కోరుతూ నియోజకవర్గ విలేకరులు నిరసన ప్రదర్శన చేపట్టారు. సీనియర్ జర్నలిస్టులు అడపా వెంకట్రావు, ఐజేయూ సభ్యుడు రాకుర్తి రాంబాబు, ఏపీయూడబ్ల్యూజే, ప్రజాసంఘాల ఆధ్వర్యాన పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద గురువారం శాంతియుతంగా నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీఓ కె.శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సాక్షి పత్రికలో తమపై వ్యతిరేకంగా వార్త ప్రచురితమైందనే కక్షతో సంపాదకులు ధనంజయరెడ్డి నివాసంలో పోలీసులు సోదాలు చేయడం దారుణమని పేర్కొన్నారు. కథనంలో అవాస్తవాలు ఉన్నాయని భావిస్తే వివరణ ఇవ్వాలే తప్ప ఇలా దాడులకు పాల్పడటం సరికాదని అన్నారు. సీఐటీయూ నాయకులు నీలపాల సూరిబాబు, డి.క్రాంతికుమార్, చల్లా విశ్వనాథం మద్దతు తెలిపారు. పత్రికలపై, పాత్రికేయులపై దాడులు అమానుషమని వారు తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో పాత్రికేయులు పెమ్మాడ వీరభద్రవర్మ, బిక్కిన వెంకట్, చవ్వాకుల ఈశ్వరరావు, ఉప్పలపాటి చంద్రదాస్, జి.సుబ్రహ్మణ్యం, పీఎస్ గంగాధర్, అడ్డగర్ల సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



సార్వత్రిక సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రాజ్ కుమార్

పెద్దాపురం: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో గురువారం గడిగట్ల సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. దేశ వ్యాప్తంగా కార్మికవర్గం చాలా కష్టాల్లో ఉందని, దాన్ని నుంచి బయటపడేయాల్సిన ప్రభుత్వాలు వారిని మరింత వెనక్కి నట్టేస్తున్నాయన్నారు. 12 గంటల పనిదినాన్ని తీసుకురావడానికి కార్మిక చట్టాలు మార్పు చేసి కోడ్‌లుగా మారుస్తున్నారన్నారు. దీనికై ఈ నెల 20వ తేదీన చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగస్వాములు కావాలని రాజ్‌కుమార్ కోరారు. అనంతరం సమ్మె కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయుకులు దాడి బేబీ, మాగాపు నాగు, గూనూరి రమణ, తాడిశెట్టి గంగ, డి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తటవర్తి



అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

పెద్దాపురం: స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తటవర్తి సత్యనారాయణ ఎన్నికయ్యారు. సాదే నరసింహారావు, సారా మురళి శ్రీనివాస్, కేఎస్ నాయుడు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. గురువారం నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా తటవర్తి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా ఎన్.దుర్గాప్రసాద్, జనరల్ సెక్రటరీ ఎస్‌కే వలీబాబు, జాయింట్ సెక్రటరీగా కందుల వెంకటాచలం, కోశాధికారిగా మడికి రాంబాబు, లైబ్రరీ సెక్రటరీగా కొండ్రు సతీష్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా పేరింశెట్టి బాలకృష్ణ, లేడీ రిప్రజెంటేటివ్‌గా సిలవరశెట్టి విశాలాక్షి, సూపర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా దేవులపల్లి సూర్యనారాయణమూర్తి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఏవీ జనార్దన్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సకురు దుర్గారావు, జమ్మి వెంకట కృష్ణారావు, పలివెల చిన్న, చంటి, వైయూఎస్ గణేష్‌కుమార్, వీవీఎస్ నారాయణమూర్తి, లేడి ఎగ్జిక్యూటివ్ సభ్యురాలిగా కాపవరపు సూర్యప్రభ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సీనియర్ న్యాయవాదులు అభినందించారు.

పార్కు ఇలా.. ఆడేదెలా?



తుప్పుపట్టినా ఆడుకోవడం తప్పదు కదా

పిఠాపురం: వేసవి సెలవులను ఆస్వాదించాలని ఉవ్విళ్లూరుతలూగే పిల్లలకు పార్కులే ప్రధాన ఆట స్థలాలు. వాటిలోనే చల్లని వాతావరణంలో ఉదయం, సాయంత్రం పిల్లలు ఆటాడుకుంటే పెద్దలు సేదతీరుతుంటారు. ఆధ్యాత్మిక కేంద్రంగా పేరొందిన పిఠాపురంలో పార్కులు అసౌకర్యాలకు నిలయాలుగా తయారయ్యాయి. పిఠాపురం నడిబొడ్డున ఉప్పాడ సెంటర్లో ఉన్న చిన్నమాంబ పార్కు కొంత కాలంగా అసౌకర్యాలకు నిలయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. పిల్లలు ఆడుకునే వస్తువులు తుప్పుపట్టి చేయి పెడితే గుచ్చుకుని గాయాలయ్యేలా తయారయ్యాయని విద్యార్థులు వాపోతున్నారు. దీనికి తోడు పార్కు ఆవరణ అంతా వర్షాలకు జలమయమై కాలు పెట్టడానికి కూడా భయపడేంతగా ఉండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై దృష్టి సారించి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



జారితే బురదలోకే



ఇలా ఉంటే ఆడేదెట్టా



ఏ గమ్యానికీ పయనం!



సాలిపేట రోడ్‌లో ఒకే బైక్‌పై ఆరుగురు ప్రయాణం

- నడిరోడ్లపై అనాలోచిత ప్రయాణాలు
- కోరి కొనితెచ్చుకుంటున్న ప్రమాదాలు
- పర్యవసానాలను గుర్తించని వైనం

కాకినాడ క్రైం: ద్విచక్రవాహనంపై ఒకరు అనుకూలం, ఇద్దరు అంగీకారం, ముగ్గురు ప్రమాదకరం.. జరుగుతున్న ప్రమాదాల నుంచి చట్టం వరకు ఇవే చెబుతున్నాయి. అలాంటిది ఓ ద్విచక్రవాహనంపై నలుగురు, ఐదురుగు, ఏకంగా ఆరుగురు ఎక్కి ప్రయాణిస్తే ఆ నిర్లక్ష్యాన్ని ఏమనాలి. అలాంటి మనుషులకు ఏమని చెప్పాలి. సరిగ్గా ఇలాంటి ప్రమాదకర విన్యాసాలే నగరంలో తరచుగా దర్శనమిస్తున్నాయి. అదీ బాధ్యతగా వ్యవహరించాల్సిన కుటుంబ జీవితాలు గడిపే వ్యక్తులే ఇటువంటి ప్రమాదాలను సకుటుంబ సపరివార సమేతంగా ఆహ్వానిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నిర్వాకంతో ఏ చిన్న ప్రమాదం చోటు చేసుకున్నా ఇంటిల్లిపాదీ బలవుతున్నారు.

ఎందుకిలా...

అవగాహన లేమితో ఇలా మితిమీరిన ప్రయాణాలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. ఏదో పొదుపు చేసేస్తున్నాం అనే భ్రమలో ఒకే వాహనంపై ఎక్కువ మంది ప్రయాణించడం ప్రమాదాన్ని కోరుండి ఆహ్వానించడమే. ఇలాంటి ప్రయాణాలతో మిగిలే మొత్తం కంటే ఏ మాత్రం తేడా జరిగినా ఆసుపత్రులకు ఖర్చయ్యేది అంతకు కొన్ని వందల రెట్లు, అప్పటికీ ప్రాణం నిలబడుతుందనే నమ్మకం లేదు. ఆటోలు, బస్సులలో కంటే ద్విచక్రవాహనంపై వెళ్లిపోతే మూకుమ్మడిగా గమ్యానికి త్వరగా చేరుకోవచ్చన్న అనాలోచిత నిర్ణయం ఇలా మితిమీరిన సంఖ్యలో ప్రమాదకర ప్రయాణాలు చేసే మొండిధైర్యాన్ని ఇస్తున్నాయి. కుటుంబాలతో పాటు యువత ఇటువంటి పెడ ధోరణిని అవలంబిస్తూ రోడ్లను ప్రమాదాలకు నిలయాలుగా మార్చేస్తున్నాయి. ఈ ప్రయాణం ఎటుకో అన్న ప్రశ్న తలెత్తేలా చేస్తున్నాయి.

ఇవీ సమస్యలు

బైక్ బరువు పెరుగుతుంది. బ్రేకింగ్ డిస్టెన్స్ పెరిగి వాహనం బ్రేక్ వేసిన వెంటనే ఆగదు. బ్యాలెన్సింగ్ సమస్య ఏర్పడుతుంది. గుంతలు, మలుపులు, స్పీడ్ బ్రేకర్ల వద్ద వాహనం అదుపు తప్పి పడిపోయే ప్రమాదం ఉంటుంది. తక్కువ స్థిరత్వం ఉండడం వల్ల సడన్ బ్రేకులు వేసే వేళ వాహనం జారిపోయే ప్రమాదం ఉంది. ఎక్కువ మంది ఒకే వాహనంపై ప్రయాణిస్తే ముందు, వెనక ఉన్న వారి సౌలభ్యం కోసం హెల్మెట్ ధరించే అవకాశం లేకపోవడం, మైలేజీ, వాహన సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం, పొరుగు వాహనచోదకులు, నడిచి వేళ్లేవారికి ప్రమాదం.

ప్రమాదం జరిగితే పైసా రాదు

ఇలా మితిమీరిన సంఖ్యలో ఒకే వాహనంపై ప్రయాణాలు చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ. ఈ ప్రయాణం ఎంతటి ప్రమాదకరమైనదైనా, పర్యవసానాలు ఏవైనా, ప్రాణాలు ఎన్ని పోయినా ఒక్క రూపాయి కూడా బీమా వర్తించదు. కాబట్టి ద్విచక్రవాహనాలపై ఇద్దరిని మించి చేసే ప్రయాణాలు ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు.


వాహనంపై ఐదుగురు.. సీఐ క్లాస్

గత నెల 21వ తేదీన కాకినాడ–సామర్లకోట రోడ్డుపై ద్విచక్రవాహనంపై వస్తున్న ఐదుగురిని అక్కడి సీఐ కృష్ణభగవాన్ ఆపి ప్రమాదకర ప్రయాణంపై కౌన్సెలింగ్ ఇచ్చారు. ముగ్గురు మహిళలను తన వాహనంలో ఎక్కించుకుని మిగిలిన ఇద్దరినీ వాహనంపై వెంట రమ్మని చెప్పి సామర్లకోట బస్సు కాంప్లెక్స్‌లో వారిని దించి బస్సు ఎక్కించారు.

తమకూ.. తోటివారికీ ముప్పే



ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణిస్తేనే కఠిన చర్యలు ఉంటాయి. అటువంటిది, నలుగురు, ఐదుగురు, ఆరుగురు ప్రయాణించడం అంటే దారుణం. ఇటువంటి వారి వల్ల తమతో పాటు తోటి ప్రయాణికులకీ ముప్పే. ప్రయాణిస్తున్న వారిలో ఒక్కరికీ ట్రాఫిక్ నిబంధనలపై విలువ లేనట్లే. ఈ విషయాన్ని ఉద్దేశపూర్వక తప్పిదంగానే పరిగణిస్తాం. ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్‌లతో అటువంటి వారిని గుర్తిస్తాం. చట్టప్రకారం జరిమానా విధించి, వాహనం సీజ్ చేస్తాం. లైసెన్సు రద్దుకు సిఫార్సు చేసే అవకాశమూ చట్టంలో ఉంది. ఇలా మితిమీరిన సంఖ్యలో ఒకే ద్విచక్రవాహనంపై ప్రయాణం చేసి ప్రమాదాలకు కారణమైతే జైలు శిక్షకూ అవకాశం ఉంది.

– దేవరాజ్ మనీష్ పాటిల్,
అదనపు ఎస్పీ, కాకినాడ

ధాన్యాన్ని కొనండి సారూ..



వీకే రాయపురంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

సామర్లకోట: మండల పరిధిలో కొందరు రైతులు ధాన్యం కోతలు చేయలేదు. వర్షాలు తగ్గడంతో కోతలు ప్రారంభించగా దిగుబడి తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి 55 నుంచి 60 బస్తాల దిగుబడి రావలసి ఉండగా 40 బస్తాలకు మించి రాలేదని వీకే రాయపురం రైతులు ఇంటి రమేష్, వెలమర్తి బుల్లిరాజు, శ్రీనివాసు, తలారి దొరబాబు తెలిపారు. ఎకరానికి రూ.35 వేల నుంచి రూ.40 వేలు పెట్టుబడి పెట్టామని, కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తీసుకువచ్చి ఆరబెట్టడానికి ఎకరానికి అదనంగా మరో రూ.4 వేలు ఖర్చయ్యిందని తెలిపారు. ఇంత కష్టపడి ధాన్యాన్ని సిద్ధం చేసినా కొనేవారు లేక బయటి వ్యక్తులకు అమ్మాల్సి వస్తోందని వారు వాపోయారు. దీని వల్ల బస్తాకు రూ.200 వరకు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులను నమ్మవద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించాలని ప్రకటిస్తున్న అధికారులు రైతుల వద్దకే వచ్చి కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

12న బహిరంగ వేలం

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలోని మామిడి చెట్ల ఫలసాయం అనుభవించడానికి ఈ నెల 12వ తేదీ ఉదయం 11 గంటలకు ఈటీసీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈటీసీ ప్రిన్సిపాల్ జి. రమణ గురువారం తెలిపారు. ఈ నెల 13 నుంచి జూలై 12 వరకు నెల రోజుల పాటు చెట్ల నుంచి వచ్చే ఫలసాయం తీసుకుపోవలసి ఉంటుందన్నారు. అభ్యర్థులు రూ. ఐదు వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాల్సి ఉంటుంది.